క్లుప్తంగా

సజ్జలతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల భేటీ



రామకృష్ణారెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, పాపారాయుడు, శ్రీనివాసరాజు, శివకుమార్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని జిల్లాకు చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కర్రి పాపారాయుడు, చింతలపాటి శ్రీనివాసరాజు, పాటి శివకుమార్‌లు ఆయనను కలిశారు. జిల్లాలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన పలు అంశాలపై ఆయన వారికి పలు సూచనలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఈ విషయాన్ని 'సాక్షి'కి తెలిపారు.

17న అమ్మవారికి సారె సమర్పణ



మహిషాసురమర్దినీ దేవి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం రవణం వీధిలో కొలువైన శ్రీమహిషాసుర మర్దినీ దేవి ఆలయంలో అమ్మవారికి ఈ నెల 17న సారె సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ వీధి యువజన సంఘం తెలిపింది. తొలిసారిగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నుంచి రవణంవీధిలో ఉన్న కొల్లూరి సత్రానికి భక్తులచే అమ్మవారి సారె ఊరేగింపు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ పి.వీరబాబు చేతుల మీదుగా సారె ఊరేగింపు మొదలయ్యే సంప్రదాయాన్ని ఈ ఏడాది నుంచే శ్రీకారం చుడుతున్నట్లు యువజన సంఘం తెలిపింది. విజయదశమి ఉత్సవాల తర్వాత అమ్మవారికి సారె సమర్పణ ఊరేగింపు ఆ రోజు ఉదయం 8 గంటలకు పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మొదలుపెడుతున్నట్లు యువజన సంఘం పేర్కొంది.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడికి చెక్కు అందజేస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన గెద్దం రాంబాబు కిడ్నీ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కిడ్నీ బాధితుడు రామ్మోహన్‌రావు వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. రమణారావు రూ.20 వేల చెక్కును రాంబాబు తల్లి వెంకటలక్ష్మికి అందజేశారు. రమణారావుకు రాంబాబు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీను, నేలపూడి సుగంధ కుమార్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'చెత్తపై పోరు' రిలే నిరాహార దీక్షలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో 12 నెలలుగా పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి పంచాయతీ కార్యాలయం ఎదురుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చెత్తపై పోరు పేరుతో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జాన జగదీష్ చంద్ర గణేష్ తెలిపారు. ప్రధాన రహదారి పొడవునా అన్ని వీధుల్లోనూ చెత్తకుప్పలు పేరుకుపోవడంతో దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

మాజీ సీజేఐని కలిసిన అల్లాడ



జస్టిస్ రమణను కలిసిన అముడా చైర్మన్ స్వామినాయుడు

అమలాపురం టౌన్: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అమలాపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం పంచాయతీరాజ్ అతిథి గృహంలో బస చేసిన జస్టిస్ రమణను స్వామినాయుడు కలిశారు. ఇటీవల అముడా చైర్మన్‌గా నియమితులైన స్వామినాయుడిని ఆయన అభినందించారు.

కంటితూడుపు చర్యలేవీ?

- నిండా పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఆధునీకరిస్తేనే ఖరీఫ్ గట్టెక్కేది..
- అలంకారప్రాయంగా నీటి సంఘం డైరెక్టర్లు



అల్లవరం మండలంలోని గుండెపూడి ప్రధాన కాలువలో పేరుకున్న తూడు



ఉప్పలగుప్తం మండలంలో తూడుతో నిండిపోయిన అయినాపురం సెక్షన్ కాలువ

అల్లవరం: అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని ప్రధాన పంట కాలువలు అధ్వానంగా మారాయి. కాలువల నిండా చెత్తాచెదారం, తూడు, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు భారీ స్థాయిలో పేరుకుపోయాయి. కాలువల్లోని చెత్తాచెదారం కారణంగా దిగువకు వచ్చే సాగునీటి ప్రవాహం సాధారణ స్థాయి కంటే తక్కువగా ప్రవహిస్తుంది. కాలువల్లోకి కాలుదిగే పరిస్థితి లేదు. ప్రధాన కాలువల వెంట ఏర్పాటుచేసిన మద్యం షాపుల కారణంగా మందుబాబులు మద్యం సీసాలను, ప్లాస్టిక్ గ్లాసులను కాలువల్లోకి విసిరేస్తున్నారు. దీంతో పగిలిన సీసాలు కాలువ మట్టిలోకి చేరి, దిగిన వారికి గాయాలు అవుతున్నాయి.

అమలాపురం రూరల్ పరిధిలో చల్లిపల్లి, బెండా కాలువ, ప్రధాన పంట కాలువ నుంచి మూడు మండలాలకు సాగునీరు చేరుతుంది. ఆయా కాలువల పొడవునా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నల్ల వంతెన నుంచి కామనగరువు వరకు అపార్ట్‌మెంట్లు, రొయ్యల కంపెనీల నుంచి వచ్చే మురుగు నీరు ప్రధాన కాలువలోకి వదిలేస్తున్నారు. అమలాపురం పట్టణంలోని మురుగునీరంతా ప్రధాన కాలువలోకి చేరుతుంది. అల్లవరం మండలంలో ప్రధాన కాలువలైన బెండా కాలువ, అల్లవరం కాలువల్లో తూడు, చెత్తాచెదారం భారీగా చేరింది. వీటికి అనుబంధంగా గుండెపూడి, బెండా కాలువ–1, 2, గోడి, మొగళ్లమూరు, రెల్లుగడ్డ, సామంతకుర్రు, బందరు కాలువల్లో చెత్తాచెదారం భారీగా పేరుకుపోయింది. ఉప్పలగుప్తం మండలంలోని ప్రధాన కాలువలు చల్లపల్లి కాలువ, జమిందారు కాలువ, అయినాపురం సెక్షన్ కాలువ, కూనవరం, భీమనపల్లి కాలువల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఒకప్పుడు కాలువల్లో చెత్త పేరుకుపోయినా, వాటిని బాగు చేసేందుకు అనువుగా ఉండేవి. నేడు కాలువల నిండా మద్యం సీసాలతో నిండిపోతున్నాయి.

నిధుల మంజూరు ఏదీ?

ఖరీఫ్ ఆరంభం నుంచి కాలువల్లో పూడికతీత పనులు ఒక్కసారీ నిర్వహించలేదు. కాలువల్లో పూడిక తీసేందుకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు చేసి ఆరు నెలలు కావస్తున్నా, నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో కాలువలు ఆధునీకరణకు నోచుకోలేదు. ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయానికి కాలువల్లో చెత్తాచెదారం తొలగిస్తే మురుగునీరు దిగువకు వెళ్లి, పంట నష్టపోకుండా ఉంటుంది. దాళ్వా పంట సమయానుకూలంగా నాట్లు వేయడానికి ఆస్కారం ఉంది. ఇరిగేషన్ అధికారులు కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, ఖరీఫ్ పంటను గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.

విధులూ లేవు.. నిధులూ లేవు!



నీటి సంఘం డైరెక్టర్లుగా నియమితులై ఆరు నెలలు కావస్తున్నా నేటికీ కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వారు కేవలం అలంకారప్రాయంగా పదవులు అనుభవిస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడానికి నిధుల కొరతతో నీటి సంఘం డైరెక్టర్లు సాహసం చేయలేకపోతున్నారు. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన కాలువ, సబ్ కెనాళ్లలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం బాటిళ్లతో నిండిపోయాయి. ఖరీఫ్ గట్టెక్కాలంటే కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించాలి. కాలువల్లో పూడిక తొలగిస్తేనే కానీ మురుగునీటికి మోక్షం లభించదు. దాళ్వా పంట కాలానికి పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది. ఆ దిశగా ఇరిగేషన్ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగులు జవహర్, నియోజకవర్గ అధ్యక్షుడు, రైతు విభాగం, వైఎస్సార్ సీపీ

సీఈసీ సభ్యుడు బాలకృష్ణకు సత్కారం



బాలకృష్ణను సత్కరిస్తున్న నాని తదితరులు

అమలాపురం రూరల్: ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యులుగా నియమితులైన రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణను వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి అభినందించారు. కామనగరువు పితానివారిపాలెంలోని ఆయన స్వగృహంలో మంగళవారం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, వైఎస్సార్ సీపీ యువజ విభాగం కార్యదర్శి విత్తనాల మూర్తి, నాయకుడు కడలి లాల్ శాలువాతో సత్కరించారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు అయినవిల్లి నరసింహమూర్తి (85) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన 2006 నుంచి 2011 వరకూ ఎంపీటీసీగా కొనసాగి, కల్లు గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, గ్రామానికి చెందిన స్టేట్ అగ్రి మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చి మహేశ్వరరావు సంతాపం తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఎన్‌జీవోల నేతలు



కలెక్టర్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

అమలాపురం రూరల్: జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్‌కు నూతన అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మాధవరపు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మంగళవారం కలిశారు. నూతనంగా ఏర్పాటైన అసోసియేషన్‌కు అమలాపురంలో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కన్వీనర్ గుత్తుల వెంకటేశ్వరరావు, ఫైనాన్షియల్ అసిస్టెంట్ ఎ.సురేష్ సింగ్, కో–చైర్మన్ ఏసుబాబు, కార్యవర్గ సభ్యులు రూతమ్మ, కొత్తపేట అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి బాబి, అమలాపురం యూనిట్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎన్జీవో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నృత్య విద్యార్థులకు అరుదైన అవకాశం



విద్యార్థులతో గురువు దుర్గాప్రసాద్

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లికి చెందిన శ్రీరామాంజనేయ డాన్స్ అకాడమీ విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందారని గురువు నాగిరెడ్డి దుర్గాప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన తాన్యప్రియ కూచిపూడి నృత్యనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డాన్స్– మ్యూజిక్ ఫెస్టివల్ పోటీల్లో ఈ అరుదైన అవకాశం లభించిందన్నారు. విద్యార్థులకు రికార్డులతో పాటు, సత్యబాల పురస్కారాలు పొందారని తెలిపారు. నాట్య కళాబ్రహ్మ పురస్కారాలను పసుమర్తి శ్రీనివాస శర్మ చేతులు మీదగా అందుకునట్లు తెలిపారు. ఇప్పటివరకు 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కూచిపూడి కళాభివృద్ధికి కృషి చేసినందుకు వివిధ సంస్థల నుంచి పురస్కారాలు అందుకునట్లు తెలిపారు.

షాపింగ్ మేళా ప్రారంభం



షాపింగ్ మేళాను ప్రారంభిస్తున్న జిల్లా నోడల్ అధికారి రవికాంత్

అమలాపురం టౌన్: జీఎస్టీ సేవింగ్స్‌లో భాగంగా అమలాపురం బంగారు, వెండి వర్తకుల సంఘ భవనం, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన షాపింగ్ మేళాలను జిల్లా నోడల్ అధికారి, సేల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ చక్కా రవికాంత్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకూ ఈ షాపింగ్ మేళాలు కొనసాగుతాయని రవికాంత్ తెలిపారు. ఈ ఐదు రోజులూ జీఎస్టీపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి తగ్గింపు ఫలితాలను పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీటీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏసీటీవో ఇళ్ల భక్త వత్సలం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ఛాంబర్ ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, బంగారు వెండి వర్తకల సంఘం అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, ఛాంబర్లకు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నడిచి వెళ్లగలవా.. ఓ పాలకా!



వర్షాలతో నరకప్రాయంగా అమలాపురంలోని నల్ల- ఎర్ర వంతెన బైపాస్ రోడ్డు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం నల్ల వంతెన– ఎర్ర వంతెన మధ్య పద్మినీపేట, హౌసింగ్ బోర్డు కాలనీ మీదుగా ఉన్న బైపాస్ రోడ్డు గోతులు, బురదనీటి మయమై తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఈ రోడ్డుపై కనీసం నడిచి వెళ్లడం కూడా నరకం కంటే దారుణంగా ఉంటుంది. ఈ బైపాస్ రోడ్డు మీదుగా చమురు సంస్థల భారీ వాహనాలు సైతం వెళతాయి. అసలే అధ్వానంగా ఉండే ఈ రోడ్డు ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిండి గొయ్యి ఏదో.. రోడ్డు ఏదో తెలియనంత అవస్థలు పడుతున్నారు వాహనచోదకులు. ఇదే రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో పెద్దాపురం, అమలాపురం ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, అయితాబత్తుల ఆనందరావుల నివాస గృహాలు ఉన్నాయి. కనీసం ఆ ఎమ్మెల్యేలు కూడా ఈ రోడ్డు దుస్థితిపై స్పందించని పరిస్థితులపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా రోడ్డు దుస్థితి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

పథకాల పనితీరుపై కేంద్ర బృందం పరిశీలన



లబ్ధిదారులతో చర్చిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు

అల్లవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పని తీరుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అధికారులు ఉమేష్‌కుమార్ రామ్, ఎస్.మయూరి వర్మ అల్లవరం మండలం బోడసకుర్రులో మంగళవారం పరిశీలన చేశారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పిస్తున్నారా? లేదా అనే విషయాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 90 రోజుల పని దినాలు పూర్తి చేసిన ఉపాధి కూలీ కుటుంబాన్ని తనిఖీ చేశారు. ఉపాధి హామీ నిధులతో నిర్మించిన కేటిల్ షెడ్డును పరిశీలించి పాడి రైతులను ఆరా తీశారు. బోడసకుర్రు పల్లిపాలెం వద్ద వైనతేయ నదీ గట్టును పరిశీలించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెల అందిస్తున్న పెన్షన్‌పై లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాంబాబు, ఎంపీడీఓ గౌరీ కుమారి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఏపీఓ రాజకుమారి, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, రొక్కాల నాగేశ్వరరావు, అడపా దత్తుడు, ఉపాధి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పినిపే శ్రీకాంత్‌కు సత్కారం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న వెంకటేష్, బాబ్జి, పార్టీ నాయకులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా నియమితులైన అమలాపురానికి చెందిన ఉంద్రు బాబ్జి, రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రటరీగా నియమితులైన ఉంద్రు వెంకటేష్‌లను అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అభినందించారు. ఈ సందర్భంగా అమలాపురం భట్నవిల్లిలో మంగళవారం పార్లమెంట్ కో–ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ నివాసం వద్ద శ్రీకాంత్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి గజామాలతో సత్కరించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ స్వీకార మహోత్సవ వేడుకలు



బౌద్ధ దమ్మ స్వీకార వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

అమలాపురం రూరల్: పట్టణ త్రిరత్న బుద్ధ విహార్ ప్రాంగణంలో బౌద్ధ దమ్మ స్వీకార మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌతమ్ బుద్ధిని వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధ విహార్ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ, ఐదు లక్షల మందితో 1956 అక్టోబర్ 14న అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు. ప్రముఖ రచయిత పిల్లి రాంబాబు రచించిన రివల్యుషనరీ బుద్ధ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్, బుద్ధ విహార్ చైర్మన్ నాగబత్తుల ప్రసాదరావు, జనరల్ సెక్రెటరీ డీబీ లోక్, సభ్యులు పాల్గొన్నారు.

యానాం: పట్టణ త్రిరత్న దమ్మ దీక్ష బౌద్ధ అసోసియేషన్, అంబేడ్కర్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బుద్ధ వందన పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బుద్ధా పార్కులో బుద్ధుడి విగ్రహం వద్ద బుద్ధ వందనాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం త్రిరత్న బౌద్ధ దమ్మ సొసైటీ అధ్యక్షుడు గుర్రపు ప్రహ్లాదుడు, కార్యదర్శి నామాడి అప్పారావు, పొనుగుమట్ల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా దమ్మ దీక్షా దినోత్సవం

తాళ్లరేవు: బీఆర్ అంబేడ్కర్ 69వ దమ్మ దీక్షా దినోత్సవాన్ని మంగళవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తాళ్లరేవు మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత బుద్ధ వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంఘ మండల అధ్యక్షుడు జక్కల ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రముఖ వైద్యులు కోరుకొండ భానుమతి, బాబ్జీ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ దమ్మ దీక్ష స్వీకరణ తదితర అంశాలను వివరించారు. అలాగే బౌద్ధ ధర్మ సిద్ధాంతాలను రాష్ట్ర కన్వీనర్ గిడ్ల వీరప్రసాద్, బౌద్ధ ఉపాసకులు పొనుగుమట్ల నరసింహమూర్తి, గుత్తాల శ్రీరాములు తదితరులు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: సామాజిక అసమానతలను తొలగించేందుకే అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బుద్ధ పార్కులో మంగళవారం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో బౌద్ధ మతం స్వీకరించిన రోజును నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, మను ధర్మ శాస్త్రం సామాజిక అసమానతలను ప్రేరేపించడమే కాకుండా దళితుల పట్ల వివక్షతకు కారణమైందన్నారు. కార్యక్రమంలో ఎస్సై డి.జ్వాలాసాగర్, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అక్షరాంధ్ర- ఉల్లాస్'పై అవగాహన

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అక్షరాంధ్ర– ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వలంటీర్ ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే వార్డు రిసోర్స్ పర్సన్స్‌ను వయోజన విద్య అధికారులు నియమించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వలంటీర్ ఉపాధ్యాయులకు 14 రకాలైన స్టడీ మెటీరియల్స్ అందజేశారు. అలాగే అభ్యాసకులకు వర్క్‌బుక్స్ ఇచ్చారు.

ముంచిన వర్షం



నీట మునిగిన కేశనకుర్రు కాలనీ రోడ్డు



నీట మునిగిన మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ రహదారి

ఐ.పోలవరం: అల్పపీడన ప్రభావంతో వరుసగా రెండు రోజులపాటు ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దఫదఫాలుగా వర్షం పడుతూనే ఉంది. వర్షానికి మండలంలో మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు వంటి ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. కొమరగిరితోపాటు పలు గ్రామాల్లో లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు చేరింది. మండలంలో సోమవారం 16.8 మిల్లీమీటర్లు, మంగళవారం ఉదయం 8 గంటల వరకు 28.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తరువాత కూడా వర్షం పడుతూనే ఉంది. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిపై వర్షం నీరు చేరడంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు.

నల్ల కొంగలు వచ్చేనుగా..



అమలాపురం నల్లా గార్డెన్‌లోని ఓ లేఅవుట్‌లో వాలిన నల్ల కొంగలు

అమలాపురం టౌన్: ఇప్పటివరకూ మనం తెల్ల కొంగలనే చూశాం. నల్ల కొంగలను చూడడం బహు అరుదే. అమలాపురం పట్టణం నల్లా గార్డెన్ వద్ద ఓ లేఅవుట్‌లో తెల్ల కొంగలతోపాటు నల్ల కొంగలు కూడా వాలిన దృశ్యం మంగళవారం ఉదయం కనిపించింది. నల్లా గార్డెన్‌కు చెందిన లంకలపల్లి ప్రసాద్ ఈ అరుదైన నల్ల కొంగలను తన ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. సాధారణంగా తెల్ల కొంగలనే చూస్తున్నాం. ఇలా నల్ల కొంగలు రావడం ఇదే తొలిసారి చూస్తున్నామని స్థానిక నివాసితులు అంటున్నారు.